# ఉదరశుద్ధి

భమిడిపాటి సోమయాజులు

సుబ్బారావు రూమ్‌లో కూర్చుని భోజనం కేరియరు కోసం ఎదురుచూస్తున్నాడు. హోటలువాడు యింకా కేరియరు ఎందుకు పంపడు? కొంపతీసి కేరియరు తెచ్చే ఆ 'బోయ్'కి ఏమన్నా వచ్చిందా?

పొద్దున్న తొమ్మిదిన్నరకి రావలసిన భోజనం! మధ్యాహ్నం ఒంటిగంటన్నరయింది! ఇంకా రాకపోవడమేమిటి?

ఇవాళ పొద్దున్న కేరియరు వస్తుందిగదా అన్న దృష్టిలో పదిగంటలదాకా ఎదురుచూశాడు. పదింపావు అయింది. క్లాసు లున్నాయి. పాఠాలు మిస్ కావడానికి వీలులేదు. ఏదో - ఏ కారణంవల్ల తేలేదోనని సమర్థించుకుని యింటిగలవాళ్లతో కేరియరు వస్తే వుంచమని చెప్పి వెళ్లాడు. కాలేజీనుంచి తిరిగిరాగానే వాళ్లు కేరియరు రాలేదన్నారు.

ఇదేమిటి? ఒంటిగంటన్నరయింది! యింకా భోజనం తేవకపోవడమేమిటి?

అసలు సుబ్బారావు సహజంగా ఆకలికి ఉండలేడు. అతడు పొద్దున్నే భోజనం విలువకి కొంచెం అటూ యిటూగా టిఫిన్ వేసుకుంటాడు. తొమ్మిదిన్నరకి భోజనం ఉంటేగాని ఉండలేడు. మళ్లా మధ్యాహ్నం రెండు ప్లేట్లూ పడాల్సిందే. అలాటి ఆకలి, సుబ్బారావుది. భోజనం విషయంలోకూడా రేషనింగు లేదు కాబట్టి సరిపోయింది గాని లేకపోతే యిబ్బందే - హోటలుకుఱ్ఱాణ్ని కొంచెం లోబరచుకొని అన్నం గిన్నం ఎక్సెస్ వేయించుకుంటున్నాడు.

అమ్మయ్య! అడుగో, వచ్చాడు; 'కేరియర్ బోయ్!'

సుబ్బారావు కేరియర్‌లో ఉన్న అన్నం తినేస్తాడా, కేరియర్నే మింగేస్తాడా, లేక కేరియరు తెచ్చిన ఆ కుఱ్ఱాణ్నే కబళించేస్తాడా, అన్నట్టున్నాడు.

* * *

కుఱ్ఱాడు భోజనం తెచ్చేలోగానే కాళ్ళూ చేతులూ కడుక్కుని పీటా, నెయ్యిసీసా, ఆవకాయా పెట్టుకు కూర్చున్నాడు.

"ఏంరా? ఇంత ఆలస్యం, యివాళ? ఎవడికిరా అంత బుద్ధిజ్ఞానం లేకపోయింది" ఒంటిగంటన్నరకిరా మీల్సు తెచ్చేది?" అని ఎగిరిపడ్డాడు, భోజనం తెచ్చిన కుఱ్ఱాడిమీద.

"అదేంటి బాబూ! రెండింటిగ్గదండీ, మీరు పంపమన్నారూ?" అన్నాడు కుఱ్ఱాడు.

"ఎవడ్రా చెప్పింది? రెండింటికి నేను మీల్సు పంపమన్నానా?" అన్నాడు, ఆశ్చర్యాన్ని కోపంలో కలిపి.

"పొద్దున్నొచ్చి చెప్పారండీ!"

"ఎవరు? ఎవరు చెప్పార్రా?"

"ఎవరేమిటండీ ?- మీరు పంపినాయనేట- నాకేం తెలుస్తాది?"

ఇంక వాడిమీదపడి లాభం లేదనుకుని, "ఏడ్చావులే!" అంటూ కేరియరు విప్పాడు. అతని ఆకలికి తగినట్టే ఉంది - గిన్నెలన్నీ ఖాళీ! కొంచెం చారూ అన్నం మట్టుకు వున్నాయి.

"ఇదేమిటి! కొంచెం అన్నం, చారూనా? యివేంరా, యిట్లా పంపాడు, బుద్ధి లేదూ?"

నిజంగా సుబ్బారావుకి మతి పోయింది. పొద్దున్న టిఫిను తినలేదు - ఖాతా హోటలుకు శలవు; డబ్బులు లేవు - అందుచేత పొద్దున టిఫిను తినలేదు. ఇప్పుడు భోజనం చేదామా అంటే చారూ అన్నం పంపాడు!

తలుపులు తినే భావగార్కి- అప్పడాలు ఫలహారమా అన్న సామెతైంది.

* * *

'ఫలహారం' కానిచ్చి, హోటలుకి వెళ్లి, హోటలువాణ్ని ఈ దురాచారం గురించి అడుగుదామనుకున్నాడు, సుబ్బారావు. కాని అప్పటికే కొంచెం బలహీనత ప్రవేశించినట్టయింది. దీనికి తోడు మధ్యాహ్నం ప్రాక్టికలు. రెండు గంటలూ నిలబడాలి.

తిన్నగా కాలేజీకి వెళ్లాడు.

ప్రకాశం నవ్వుతూ "హలో! ఏమి టివ్వాళ, నీకు ప్రాక్టికలు?" అన్నాడు.

"సాల్టోయ్!" అన్నాడు, సుబ్బారావు నిరుత్సాహంగా.

"ఏం, అలా వున్నావు?"



తెలుపు, నలుపు

—ఫొటో : పి. శివరామరాజు, మద్రాసు.

"ఏం లేదులే," అని తప్పుకో బోయాడు, సుబ్బారావు.

ప్రకాశం నవ్వుతూ "భోంచేశావా లేదా, చేసినట్టు లేదే!" అన్నాడు. అత నెందుకో నవ్వు నాపుకుందుకు చాలా ప్రయత్నం చేస్తున్నాడు

అనహానం హెచ్చయి, "చేశా" అని తప్పుకున్నాడు, సుబ్బారావు.

ప్రకాశం అటు వేపు చాలి రుమాలు నోటికడ్డంపెట్టుగుని నవ్వుకుంటున్నాడు.

"ఏంటోయ్?" అంటూ క్రిష్ణమూర్తి ప్రకాశందగ్గరికి చేరాడు. వాళ్లిద్దరూ ఏవేవో గుసగుసలాడేరు.

ప్రాక్టికలు అయ్యేలోగా చాలా సార్లు ప్రకాశం సుబ్బారావువేపు చూశాడు సుబ్బారావుకి ఎలాగో నుంది.

అలవాటు ప్రకారం రాత్రి హోటలుకి భోజనానికి వెళ్లాడు, సుబ్బారావు

"ఏమి సుబ్బారావుగారూ! విరేచనాలకి మందు పుచ్చుకున్నారటగా - ఎట్లా వుంది?" అని పలకరించాడు, హోటలువాడు

మళ్లా మధ్యాహ్నం వొచ్చినంత ఫోర్సూ వచ్చింది, సుబ్బారావుకి - "ఎవడు చెప్పాడూ?" నిలదీస్తున్నట్టు అడిగాడు

"ఎవరోనండీ - పొద్దున్నే వచ్చి చెప్పారండీ - 'ఇవాళ సుబ్బారావుగారు విరేచనాలకి మందు పుచ్చుకున్నారు, పూర్తిగా భోజనం పంపవద్దు - చారూ అన్నం పంపమన్నారు' అని చెప్పారండీ!"

పూర్తి కారణం తెలుసుకున్న తరవాత సుబ్బారావుకి 'ఫోర్సు' తగ్గిపోయింది పైగా అంత నీరసంలోనూ నవ్వు వచ్చింది - "రెండు గంటలకి పంపమనికూడా చెప్పారు కదూ?" అని అడిగాడు, చివరి సందేహాన్ని.

"అవునండి, మధ్యాహ్నం కాలేజీనుంచి మీరు వచ్చే వేళకి పంపమన్నారండి!"

"అవును! బోధపడ్డాది. ఎవడో వెధవ, నన్ను ఏడిపించడానికి ఈ రోజు అలా చెప్పాడు. నేను విరేచనాలకి మందూ పుచ్చుకోలేదు - చారూ అన్నం పంపమని చెప్పాలేదు-" అంటూ తెంపేసి, టేబిల్ దగ్గరికి దారితీశాడు.

హోటలువాడు సానుభూతిగా, "అరె! అదేం సార్? నిజంగా కాదా?" అని అన్నాడు.

ప్రకాశం గుర్తొచ్చాడు, సుబ్బారావుకి!...